

ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం



పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని ఎమ్మార్‌నగరంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను కేంద్రం సాంకేతిక బృందం శని, ఆదివారాలు పరిశీలించినట్లు ప్రిన్సిపల్ విలియం కేరి తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భోధనా తరగతులు లభ్యత, ల్యాబ్‌తో పాటు సిబ్బంది పనితీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన తెలిపారు.



పాలిటెక్నిక్ కాలేజీని పరిశీలించేందుకు వచ్చిన బృందం

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజాపోరు

ప్రజాశక్తి - సాలూరు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాధం పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఆరు జిల్లాల్లో సిపిఎం చేపట్టిన బైక్ యాత్ర ఆదివారం సాయంత్రం పట్టణానికి చేరింది. బంగారమ్మపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మాజీ ఎమ్మెల్యే కొరటాల సత్యనారాయణ శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బంగారమ్మ పేట, కోట వీధి, వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్, గాంధీనగర్, శివాజీ సెంటర్, బోసుబొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్నె నాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో లోకనాధం మాట్లాడుతూ ఎంతోమంది బలిదానాలతో ఏర్పడిన స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయాలని మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఉక్కు పరిశ్రమ ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందన్నారు. స్టీల్ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజలను చైతన్య పరచడానికే బైక్ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 29న విశాఖ లో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా నాయకులు జగన్, శ్రీకాకుళం జిల్లా నాయకులు తిరుపతిరావు, మన్యం జిల్లా నాయకులు ఇందిర, మన్మధరావు, పాచిపెంట మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, సాలూరు మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కురుపాం : స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన బైక్‌యాత్ర ఆదివారం కురుపాం చేరుకుంది. తొలుత కురుపాం పెట్రోల్ బంకు నుంచి రావాడ జంక్షన్ వరకు బైక్ యాత్ర సాగింది. అనంతరం సిపిఎం జిల్లా కమిటీసభ్యులు మండంగి రమణ ఆధ్వర్యంలో జరిగిన సభలో వేణు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ వల్లే ఉత్తరాంధ్రలో వలసలు తగ్గాయని, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను మోడీ సర్కారు ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం దుర్మార్గమని అన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని, ఆదానీ


సాలూరు పట్టణంలో కొనసాగుతున్న సిపిఎం బైకు ర్యాలీ


పార్వతీపురం : భగత్‌సింగ్‌కు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

పోర్టుకు ఉపయోగపడేలా స్టీల్‌ప్లాంట్‌ను మార్చేసిందని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ కుట్రకు పాల్పడుతుంటే రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన నోరు మెదపడం లేదని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ యూనియన్ అధ్యక్షులు పి.కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కటినీ ప్రయివేటుపరం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్, స్టీల్ ప్లాంట్ జనరల్ సెక్రెటరీ కెఎం శ్రీనివాస్, స్థానిక సిపిఎం నాయకులు కోలక అవినాష్, ఎం.శ్రీనివాసరావు, కొల్లి గంగ నాయడు, తిరుపతిరావు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు లోకనాధం

వీరఘట్టం : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ బైక్‌ర్యాలీ ఆదివారం ఉదయం మండల కేంద్రానికి చేరుకుంది. స్టీల్ ప్లాంట్ నిర్వహణకు రూ.5వేల కోట్లు ఇవ్వాలని, సొంత గనులు కేటాయించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, తదితర అంశాలపై పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి థియేటర్ నుంచి వట్టిగెడ్డ వంతెన వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, కె.గంగునాయుడు, సింహాచలం, వై.ప్రసాదరావు ఎన్.ప్రసాదరావు, పి.ప్రసాదరావు, నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : ఉక్కు రక్షణ బైక్ యాత్రకు సీతానగరంలో సిపిఎం నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ ర్యాలీ చినబోగిలి, మక్కువ మీదుగా సాలూరుకు చేరుకుంది.

సాలూరు రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై ఉక్కు రక్షణయాత్ర మండలంలో అన్నంరాజువలస, మామిడిపల్లి, బొడ్డవలస బంగారమ్మ పేట గ్రామాలు మీదుగా సాలూరు పట్టణానికి చేరుకుంది. బైక్ యాత్రలో స్థానిక సిపిఎం నాయకులు మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, గాసి, మన్మధ, పండు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌యాత్రకు అపూర్వ స్వాగతం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విశాఖ స్టీలుప్లాంట్ పరిరక్షణకై ఉక్కురక్షణ యాత్రపేరిట ఈనెల 20నుంచి 29 వరకు జరుగుతున్న ఉత్తరాంధ్ర బైక్ యాత్ర ఆదివారం పార్వతీపురంలోకి ప్రవేశించింది. పార్వతీపురం ముఖద్వారం అడ్డాపుశిలలో సిపిఎం మండల నాయకులు బంటు దాసు ఆధ్వర్యంలో ఉక్కు రక్షణ యాత్ర సారధి కె.లోకనాధం, ఆయనతో పాటు అలుపెరుగక ప్రయాణిస్తున్న నాయకులు, కార్యకర్తలకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. సిఐటియు ఉపాధ్యక్షులు వి.ఇందిర, ఐద్వా నాయకులు లక్ష్మి తిలకందిద్ది ఆహ్వానించారు. అనంతరం ర్యాలీ పార్వతీపురం పాత బస్టాండ్ కూడలికి చేరుకోగా, స్థానిక ఆటోవర్కర్స్ సంఘం యాత్రలో పాల్గొన్న వారందరిపైనా పూలవర్షం కురిపించి మద్దతు పలికారు. అనంతరం నెహ్రూ మున్సిపల్ మార్కెట్ అవరణలోకి భగత్‌సింగ్ విగ్రహానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో ఈయాత్రను కొనసాగిస్తామని తెలిపారు. ఆ తర్వాత పార్వతీపురం ప్రధాన రహదారి గుండా ఎర్రజండాలతో సాగిన ర్యాలీకి ప్రజల నుండి అపూర్వ స్పందన కనిపించింది. స్థానిక ఆర్టీసి కాంపెక్స్ కూడలికి చేరుకున్న నాయకులకు కార్యకర్తలు నృత్యాలు చేస్తూ స్వాగతం పలుకగా, ఉక్కు రక్షణ యాత్ర నాయకులు వారితో కలిసి డాన్సులు


పార్వతీపురంలో ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శన

చేస్తూ వారిని ఉత్సాహపర్చారు. ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ప్రజలను ఆలోచింపజేశాయి. అనంతరం జరిగిన సమావేశంలో బైక్‌యాత్ర, లక్ష్యం, ఉద్దేశ్యాలు, విశాఖ స్టీలుప్లాంట్ పరిరక్షణ ఆవశ్యకత, అవసరాన్ని వివరిస్తూ లోకనాధంతో పాటు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి శ్రీదేవి, వై.మన్మధరావు, జి.వెంకటరమణ, బివి రమణ, బి.సూరిబాబు, పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళం నాయకులు టితిరుపతిరావు, విశాఖ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం

చలో విజయవాడ వెళ్లకుండా పోలీసుస్టేషన్లు, ఇళ్లల్లో నిర్బంధం

ప్రజాశక్తి-పాలకొండ

కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించారు. ఏళ్ల తరబడి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈనేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ఈ కార్యక్రమానికి ఎవరూ వెళ్లకుండా ఆదివారం ఉదయం నుంచి యూనియన్ నాయకులను పోలీసులు ఎక్కడిక క్కడ గృహ నిర్బంధం చేశారు. మరికొందరిని స్టేషన్‌కు తరలించారు. పాలకొండలో అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జెస్సీబాయితో పాటు, యూనియన్ పూర్వపు ప్రధానకార్యదర్శి హిమప్రభ తదితరులను గహనిర్బంధం చేశారు.

బొబ్బిలి : పట్టణ ప్రాజెక్టు నాయకులు జె.కామేశ్వరి, ఎ.రోజాను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు.

జామి : మండల నాయకులు వెంకటలక్ష్మిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యకర్తలందరినీ చలో విజయవాడకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. వేపాడలో యూనియన్ నాయకులు కె.లక్ష్మిని వల్లంపూడి పోలీసులు గృహ నిర్బంధం చేశారు.


పాలకొండలో గృహనిర్బంధంలో ఉన్న హిమప్రభ

రాజాం : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బి.ఉమా కుమారి, ఎల్.జయలక్ష్మి, నాయకులు లక్ష్మీనారాయణ, రాంబా యి, పార్వతి మంగమ్మ, వరలక్ష్మి తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి అరెస్టులను సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి ఖండించారు.

గజపతినగరం : అంగన్వాడీ యూనియన్ గజపతినగరం ప్రాజెక్టు అధ్యక్షులు ఎం సుభాషినిని పోలీసులు అరెస్టు చేశారు. చలో విజయవాడకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో తమ ఇంటి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆమెను అరెస్టును సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్ ఖండించారు.

అంగన్వాడీల అరెస్టులు దుర్మార్గం : సిఐటియు

పార్వతీపురం : సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు అంగన్వాడీ నాయకులను, కార్యకర్తలను ఎక్కడిక్కడ అరెస్టులు చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణా రావు, వై.మన్మధరావు, శ్రామిక మహిళా నాయకులు వి.ఇందిర ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న విజయవాడ ధర్నాచౌక వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తామని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ దరఖాస్తు చేసినా అనుమతి లేదని నాయకుల ఇళ్లకు వెళ్లి భయభ్రాంతులకు గురి చేసి స్టేషన్లకు తరలించడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యని పేర్కొన్నారు. వెంటనే నాయకులను, అంగన్ వాడీ కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు చివరి అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా అయినా పరిష్కరించాలని కోరితే నిర్బంధం ప్రయోగించడం సరికాదని తెలిపారు. అంగన్ వాడీలకు వేతనాలు పెంచాలని, అంగన్వాడీ లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం,పెన్షన్, పిఎఫ్,ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చెయ్యాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చా లని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎంతటి నిర్బంధాన్ని ప్రయోగించినా ఉధృతపోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జిజె ప్రసాద్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. 30న వీరఘట్టం- 3 సచివాలయం, అక్టోబర్ 3న చలివేంద్రి, 4న హుస్సేన్‌పురం, 5న కంబర, 6న కత్తులకవిటి, 7న కిమ్మి, 9న నీలానగరం, 10న నర్సిపురం, 11న తలవరం, 12న చిదిమి, 13న తెట్టంగి, 16న చిన్న గోరకాలనీ, 17న తూడి, 18న చిట్టపూడివలస, 19న వండువ, 20న దశమంతపురం, 21న పనసనందివాడ, 24న నడిమికెల్ల, 25న రేగులపాడు, 26న నడుకూరు, 27న వీరఘట్టం-4, 30న వీరఘట్టం-2లో పర్యటిస్తాయన్నారు. ఈ గ్రామాల్లో రెండు బందాలు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలిపారు.

సీతంపేటలో వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండ కాసినప్పటికీ మధ్యాహ్నమయ్యే సరికి చల్లటి వాతావరణం, పిడుగులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో మండలంలోని చెరువులు, వాగులు జలకళతో నిండుగా కనిపిస్తున్నాయి. పొట్ట దశలో ఉన్న ఈ వర్షం ఎంతో అవసరం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే మెట్టుపంటలకు కూగా ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం వచ్చిందంటే చాలు పర్యాటకులు సందడి చేస్తారు. సెలవు రోజుల్లో పర్యాటకులు వచ్చి పార్కులోని అందాలను ఆశ్వాదిస్తారు. జలవిహార్ వద్ద యువతీ,యువకులు బోటు షికారు చేశారు. జలవిహార్‌పైన పర్యాటకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. చిన్నారులు మినీ ట్రైన్, కమాండో నెట్ ఎక్కి ఆడుకున్నారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

టిడిపి శ్రేణుల్లో కొరవడిన ఉత్తేజం

గ్రూపులతో కొట్టుమిట్టాడుతున్న వైనం నాయకుల్లో కానరాని ఐక్యతా రాగం

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా తెలుగుదేశంలో శ్మశాన వైరాగ్యం ఆవహించినట్లు కనిపిస్తోంది. తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు కావడం, జైలు పాలై పదిరోజులు దాటినా బెయిల్ రాకపోవడంతో స్థానిక నాయకులు, కేడర్‌లో కొంత నైరాశ్యం ఏర్పడింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎన్నికల నాటికి పార్టీ కొంత పుంజుకుంటుందని భావించినా ప్రతికూల పరిస్థితుల కారణంగా సంక్షోభం వెంటాడుతోంది. జిల్లాకు సమర్ధవంతమైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కొరవడింది. రాష్ట్ర వ్యాప్తంగా పీడిస్తున్న ఆగష్టు సంక్షోభం తర్వాత పార్టీలో ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయోనని నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక వైపు సంక్షోభం తరుముకొస్తున్నా నియోజకవర్గ స్థాయిలో గ్రూపుల మధ్య ఐక్యతా రాగం కనిపించడం లేదు. దీంతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ప్రధానంగా వరుసగా మూడు సార్లు ఓటమి పాలైన సాలూరు నియోజకవర్గంలో పార్టీకి బలమైన కేడర్ ఉన్నట్లు కనిపిస్తున్నా నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. నియోజకవర్గ ఇంఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ గ్రూపుల మధ్య సమన్వయం ఇప్పటికీ ఎండమావి గానే ఉంది. కొద్దినెలల క్రితం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్వహించిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేసిన అంశాలేవీ అమలుకు నోచుకోలేదు. నియోజకవర్గ సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని, నెలకోసారి సమావేశం నిర్వహించాలని, కార్యాలయం ప్రారంభించాలని చంద్రబాబు నాయుడు నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణినిఆదేశించారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తున్నా ఆచరణకు నోచుకోలేదు. పార్టీ సంక్షోభ పరిస్థితుల్లో వున్నా నాయకుల మధ్య ఐక్యతా రాగం కనిపించకపోవడంతో పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలలో ఆత్మవిశ్వాసం క్షీణిస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా జరుగుతున్న ధర్నా, ఆందోళన కార్యక్రమాల్లోనూ గ్రూపు రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాయకులు ఎవరికి వారే నిరసన కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో సమన్వయం కనుచూపు మేరలో కనిపించడం లేదు. సొంత నియోజకవర్గంలో అసమ్మతి సెగను ఎదుర్కొంటున్న పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి మన్యం జిల్లా అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ జిల్లా నాయకత్వం సమర్ధవంతంగా నిర్వహించలేక, సొంత ఇంట్లో అసమ్మతి సెగను చల్లార్చ లేని పరిస్థితుల్లో సంధ్యారాణి ఉన్నారు. ఇక పార్వతీపురం నియోజకవర్గం టిడిపిలో గ్రూపు రాజకీయాలు పైకి కనిపించకపోయినా నివురుగప్పిన నిప్పులా రాజుకుంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవిని నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించడంతో గ్రూపు రాజకీయాలకు బీజం పడింది. గతంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ కూడా నియోజకవర్గంలో అధికారపార్టీ నాయకుల అరాచకాలను ఎండగట్టడంలో విఫలమవుతున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా యువ నాయకుడు విజయచంద్రకి అప్పగించారు. దీంతో కొంత ఊపు వస్తుందని ఆశతో పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇక కురుపాంలోనూ గ్రూపు రాజకీయాలు బుసకొడుతూ ఉన్నాయి. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు మధ్య నివురుగప్పిన నిప్పులా గ్రూపు రాజకీయాలు నెలకొన్నాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరికి నియోజకవర్గ నాయకుల నుంచి పూర్తి స్థాయిలో మద్దతు లభించడం లేదు. అధికారపార్టీపై నెలకొన్న వ్యతిరేకతని సొమ్ము చేసుకోవడంలో టిడిపి నియోజకవర్గ నాయకులు విఫలమవుతున్నారు. పాలకొండ నియోజకవర్గంలోనూ టిడిపికి ఎదురీదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కూడా ఇద్దరు నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా యువ నాయకుడు జయకృష్ణ ఉన్నా కేడర్‌లో ఉత్తేజం కొరవడుతోంది. నియోజకవర్గంలో వైసిపి నాయకుల మధ్య నెలకొన్న గ్రూపు రాజకీయాలను సొమ్ము చేసుకునే అవకాశం ఉన్నా ఆ పరిస్థితి కనిపించడం లేదు. తాజా పరిణామాల నేపథ్యంలో మన్యం జిల్లాలో టిడిపి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునే పరిస్థితి ఏర్పడింది .


మృతి చెందిన గొర్రెలు, మేకలను చూపుతున్న పెంపకందారులు

పిడుగుపాటుకు 9 మేకలు, రెండు గొర్రెలు మృతి


ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలో విజయరామపురం సమీపాన ఆదివారం మధ్యాహ్నం పిడుగుపాటుకు 9 మేకలు, రెండు గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని కోన గ్రామానికి చెందిన యాసై గంగయ్య, వెంకటరమణ తదితరులు గొర్రెలు కాపర్లు మేత కోసం గొర్రెలను తీసుకువెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం పడింది. ఇదే సందర్భంలో చలిపిడుగు కూడా పడడంతో ఒక్కసారిగా మేకల మంద వణికిపోతూ ఒకదాని తర్వాత మరొకటి ఇలా వరుసగా 11 మేకలు గొర్రెలు, మృతి చెందాయి. దూరం నుంచి గమనించిన మేకలు కాపర్లు దగ్గరకు వచ్చి చూసేసరికి మొత్తం చనిపోయాయి. దీంతో స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ ఎం.రమేష్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పశుసంవర్ధకశాఖ ఉద్యోగి ఉన్నతాధికారులు సమాచారం అందించారు. మేకలకు ఎటువంటి బీమా లేదని ధ్రువీకరించారు. దీంతో రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రకృతి తమను కోలుకోలేని దెబ్బతీసిందని గొర్రెల కాపరులు వినిపిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఫ్లైఓవర్ గోతుల్లో తేలిన ఇనుప గజాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని దీప్తి లాడ్జి కూడలి నుంచి, అటు శ్రీకాకుళం రోడ్ వైపు, ఇటు బైపాస్ రోడ్డు వైపు ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీద పలుచోట్ల గోతులు ఏర్పడి పైకి ఇనుప గజాలు తేలిపోయి ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా వాహనాల టైర్లు గోతుల్లో ఉన్న ఇనుప గజాలకు గుచ్చుకొని టైరులు పంచర్లు అవుతున్నాయి. వీటితో పాటు ఏ మాత్రం చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో వర్షపు నీరు చేరి ఉండడంతో రాత్రి వేళల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు భయం భయంగా వాహనాలను నడుపుతున్నారు. ఫ్లైఓవర్ పై రాకపోకలు సాగించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బి అధికారులు ఉన్నప్పటికీ బ్రిడ్జి మీద ఏర్పడే గోతులకు కనీస మరమ్మతులు చేయకపోవడమేమిటని సంబంధిత అధికారులను వాహన చోదకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు ఇప్పటికైనా స్పందించి ఫ్లై ఓవర్‌పై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేయించే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


బ్రిడ్జిపై ఏర్పడ్డ గోతులు

కొరటాల ఆశయ సాధనకు పునరంకితం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదల అభ్యున్నతికి, సమాజ మార్పునకు ఎనలేని కృషి చేసిన కమ్యూనిస్టు మేధావి,సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి కామ్రేడ్ కొరటాల సత్యన్నారాయణ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సిపిఎంజిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. కొరటాల సత్యన్నారాయణ శత జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి తమ్మినేని పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.లక్ష్మి పి.రమణమ్మ, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొరటాల ఉద్యమస్ఫూర్తిని యువతకు అందించాలి

విజయనగరం కోట : పేదల అభ్యున్నతికి కృషి చేసిన కమ్యూనిస్టు నాయకులు కొరటాల సత్యనారాయణ ఉద్యమస్ఫూర్తిని యువతకు అందించాలని ప్రజాశక్తి డెస్క్ ఇంఛార్జి పి.అప్పారావు అన్నారు. ప్రజాశక్తి కార్యాలయంలో కొరటాల చిత్రపటానికి సీనియర్ సబ్ ఎడిటర్ కె.కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ ప్రజాశక్తి అభివృద్ధిలో కొరటాల కీలకపాత్ర పోషించారని, ఆయన ఆశయాలను పత్రిక ద్వారా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ కె.రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం : మండలంలోని కంచరాం గ్రామంలో కొరటాల జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పేదల కోసం పోరాడిన మహానాయకుడని కొనియాడారు.



కొరటాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు తమ్మినేని, శంకర్రావు



గిరిజనులకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న జగన్మోహన్

గిరిజనులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - కొమరాడ

తనకు అవకాశం ఉన్న ప్రతిసారి గిరిజనులు, పేదలకు ఏదో ఒక రూపంలో సేవ చేస్తూ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జగన్మోహన్రావు మానవత్వాన్ని చాటుకుంటున్నారు. గిరిశిఖర గ్రామంలోని గిరిజనులకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు తన కుమారుడు యువాన్ పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు, నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ కుటుంబాలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. చిన్న పిల్లలకు బిస్కట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంతోమంది అనాథలకు, ఆపన్నులకు, మనం చేసే కొద్ది సేవ కూడా ఆదుకొనే అవకాశాలు ఉన్నాయని, ఉపాధికరువై, అన్న వస్త్రాలు సైతం లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, అలాంటి వారికి ఏచిన్న సాయం అందినా దానికి ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం గ్రామస్తులు అభినందిస్తూ అతని కుమారునికి ఆశీస్సులు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర రావు, రమేష్ బాబు,జయగౌడ్, బి.వి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో చదవిస్తున్న గ్రంథాలయాధికారి

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ ఆవరణంలో వచ్చిన పిల్లలతో నీతి కథలు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందేందుకు ఆటలు, పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన్ రావు మాట్లాడుతూ చదువుకు మించిన సంపద ఏదీ లేదని తెలిపారు. అందుకు విద్యార్థులు తప్పక చదువుపై శ్రద్ధ చూపాలని కోరారు. ఇంట్లో ఖాళీ సమయాల్లో సెల్‌ఫోన్‌కు సమయం ఇవ్వకుండా పుస్తకాలు పట్టుకోవాలని, స్కూల్లో ఇచ్చిన హెూం వర్క్‌లు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని తెలిపారు. తల్లిదండ్రులు, గురువులు మాటలను పెడ చెవిని పెట్టరాదని తెలిపారు.

జిల్లా కేంద్రానికి బస్సు ఏదీ?

ప్రజాశక్తి -భామిని

నూతన జిల్లాలు ఏర్పాటులో భాగంగా భామిని మండలం కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో చేరింది. అయితే మా జిల్లాకు చేరుకోవడానికి నేరుగా బస్సు ఏదంటూ మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక ఏ చిన్న పనికి జిల్లాకేంద్రానికి వెళ్లాలన్నా ఇటు ఉద్యోగులు, విద్యార్థులు, అటు ప్రజా ప్రతినిధులు అవస్థలు పడుతున్నారు. పార్వతీపురం వెళ్లాలంటే ఎలారా బాబు అని అనుకుంటున్నారు. కొత్త జిల్లా పేరుతో ఒక బస్సు అయినా భామిని మండల కేంద్రం నుండి వెళ్తే బాగుటుందని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశపై స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులకు, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులకు చెప్పినా ఫలితం కనిపించడం లేదంటున్నారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి భామిని మండలం కేంద్రంగా ఆర్‌టిసి బస్సు సర్వీసును కొనసాగించాలని కోరుకుతున్నారు.



అన్నదానం చేస్తున్న వైసిపి నాయకులు శ్రీనివాసరావు

ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని నాలుగో వార్డు తూర్పు వీధిలో స్థానిక వైసిపి నాయకులు కోరాడ శ్రీనివాసరావు (నాని), గణేష్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు వీధుల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పట్టణ జిసిఎస్ కన్వీనర్ గొర్లె మాధవరావు, స్థానిక వైసిపి సీనియర్ నాయకులు రెడ్డి రామారావు, కోరాడ చిట్టి, సారికి కృష్ణంనాయుడు, ఎస్.చంద్ర, గృహసారథులు, కార్యకర్తలు, వివిధ వార్డుల భక్తులు సహాయ సహకారాలు అందించారు.



రైతుల నుంచి బయోమెట్రిక్ సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

వెంగాపురంలో ఇ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పలగర, వెంగాపురం గ్రామాల్లో ఆదివారం రైతుల నుంచి ఇ-క్రాప్ బయోమెట్రిక్ నమోదు వ్యవసాయాధికారులు చేపట్టారు. రైతులు వేసిన పంటకు ప్రతి రైతు బయోమెట్రిక్ వేసి ఆమోదించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.శ్రావణ్ అన్నారు రైతు వేసిన పంటను ఒక సారి చూసుకుని ఆధార్ బయోమెట్రిక్ వేయాలన్నారు. ఇంకా ఎవరైనా రైతులు వేసినా ఆ పంట ఈ క్రాప్ చేయించుకోవడానికి ఈనెల 30 వరకు సమయం ఉందన్నారు. కావున ప్రతి రైతు ఈ క్రాప్ చేసుకోవాలన్నారు. మండలంలో ప్రస్తుతం 18500 ఎకరాలకు గానూ 14080 ఎకరాలు ఇ- క్రాప్ నమోదైందన్నారు. మిగతాది ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని విఎఎను ఆదేశించారు.

26న తైక్వాండో పోటీలకు ఎంపికలు

విజయనగరం టౌన్ : ఈనెల 26న అండర్ 19 జూనియర్ కాలేజి విభాగంలో జిల్లా తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా ప్రాంగణంలో ఎంపిక పోటీలు జరుగుతాయి.

చిలకాంపై చిన్నచూపు

- దశాబ్దాల తరబడి మట్టిదారిపైనే రాకపోకలు
- వర్షం పడితే బురదలోనే ప్రయాణం
- వెలగని విద్యుత్ దీపాలు
- చీకటి పడితే రహ'దడే'

ప్రజాశక్తి -గరుగుబిల్లి

చిలకాం గ్రామస్తుల అమాయకత్వంతో రాజకీయ నాయకులు ఆటాలాడుకుంటున్నారు. దశాబ్దాల తరబడి చిలకాం గ్రామానికి రహదారి లేకపోయినా ఏ పార్టీగానీ, ఏ నాయకుడుగానీ పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఓట్లు కోసం వచ్చినప్పుడు కళ్లబొల్లి కబుర్లు చెప్పడం, ఆ తర్వాత ముఖం చాటేయడం, ప్రతి ఎన్నికల సమయంలోనూ నేతల చేతులో ఇలా మోసపోవడం ఆ గ్రామస్తులకు అలవాటుగా మారిపోయింది. దశబ్దాల తరబడి మండలంలో చిలకాం పంచాయతీ వాసులకు రహదారి సమస్య ప్రధాన సమస్యగా మారింది. పార్వతీపురం-పాలకొండ వెళ్లే ప్రధాన రహదారి నుంచి చిలకాం గ్రామానికి వెళ్లే రహదారి అరకిలో మీటరు మేర ఉంటుంది. ఇది గుంతకులమయమైన మట్టి రోడ్డుపైనే దశాబ్దాల నుంచి ఆ గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. మట్టి రోడ్డు మొత్తం గోతులు మయం కావడంతో, ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే గ్రామస్తులు హడలిపోతున్నారు. మరో మార్గం లేకపోవడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో ఛిద్రమైన మట్టి రహదారి మీదుగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పంది. ఇదే విషయమై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. దీంతో గ్రామస్తులే చందాలు వసూలు చేసుకుని, కంకరమట్టి వేసుకుంటూ వస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారీ ఆ రహదారిపై కంకర, ఇతర మట్టి కరిగిపోయి, గోతులమయంగా మారుతోంది. 2వేల జనాభా కలిగిన తమ గ్రామం పట్ల అధికారులు, నాయకులు చిన్నచూపు చూపడం తగదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు కోసం వచ్చినప్పుడు, తాముకున్నామంటూ మాయమాటలు చెప్పి, అవసరం తీరాక వారెవరు తమ రహదారి గురించి పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. రోగులను, గర్భిణులను అత్యవసర సయమంలో ఈ రహదారి మీదుగా తరలించడం తలకుమించిన భారంగా మారుతోందని వాపోతున్నారు.

టెండర్లు పిలిచినా స్పందన కరవు...

2017లో చిలకాం రహదారి నిర్మాణానికి ఎంపి నిధులు నుంచి రూ.16 లక్షలు అప్పటి ఎంపి కొత్తపల్లి గీత నిధులు మంజూరు చేశారు. చిలకాం రహదారి పనులపై అప్పట్లోనే అధికారులు టెండర్లు సైతం పిలిచారు. కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాకపోవడంతో చిలకాం రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. మంజూరైన రూ.16 లక్షలు ఏమయ్యాయని గ్రామస్తులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చిలకాం రహదారి నిర్మాణానికి ముందుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు.

రాత్రయితే దడే

ఛిద్రమైన చిలకాం రహదారిపై ప్రయాణం చేయడానికి హడలిపోతున్నా గ్రామస్తులు రాత్రయితే మాత్రం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎంత పని ఉన్నా ఊరు దాటి రావడానికి భయపడుతున్నారు. అరకిలోమీటరు మేర ఉన్న చిలకాం రహదారి పక్కన విద్యుత్ స్తంభాలున్నా అవి నిరుపయోగం పడి ఉన్నాయి. దీంతో చీకటి పడేసరికి రోడ్డంతా గాడాంధకారం అలుముకుంటోంది. అసలే గోతులు, ఆపై కటిక చీకటి కావడంతో ఆ గ్రామస్తులు ఆ రోడ్డు మీదుగా ప్రయాణం చేయడానికి బెంబేలెత్తిపోతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు విద్యుత్ అధికారులను వేడుకున్నా స్పందించడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలను సైతం గ్రామస్తులే విరాళాలు సేకరించుకుని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. పంచాయతీలో నిధులు లేమి పేరుతో విద్యుత్ అధికారులు తమ గ్రామాన్ని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాయకులన్నా ప్రయోజనం సున్నా...



చిలకాం గ్రామం నుంచి ఎందరో నాయకులు ప్రతిప్రతినిధులుగా ఎన్నికయ్యారు. జెడ్‌పిటిసిగా, ఎంపిటిసిలుగా పలువురు నాయకులు బాధ్యతలు స్వీకరించారు. కానీ, వారు ఏనాడూ చిలకాం రహదారి నిర్మాణానికి కృషి చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాభివృద్ధి కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే వారంతా ప్రాధాన్యమిచ్చారని వాపోతున్నారు. అన్ని పార్టీల నాయకులు తమను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప, చిలకాం గ్రామాభివృద్ధికి ఏ ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేసిన పాపానపోలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి, తమ గ్రామానికి రహదారి సౌకర్యంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, లేకుంటే సరైన సమయంలో సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడంలేదు..

నాకు 35 ఏళ్లు. నేను పుట్టినప్పటి నుంచి మట్టి రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాం. మా తండ్రులు, మా తాతలు కూడా ఆ మట్టి రోడ్డుపైనే నడిచారు. మా బాధను ఎవరూ పట్టించుకోవడం లేదు. చివరికి రోడ్డు పక్కన విద్యుత్ దీపాలు సైతం వెలగడం లేదు. రాత్రయితే మాకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. నాయకులంతా ఓట్లు కోసం వస్తుంటారు. కానీ మా కష్టాలు మాత్రం పట్టించుకోవడం లేదు.

ద్వారపురెడ్డి దర్శిత్
గ్రామస్తుడు, చిలకాం


టిడిపి నాయకుల జలదీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలంలోని జమదాలలో ఆదివారం, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ రెడ్డి భారతి, ఎంపిటిసి పి.శ్రీనివాసరావుతో కలిసి ఆ గ్రామంలోని చెరువులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ జలదీక్షలు నిర్వహించారు.

కురుపాం రాజకీయ కక్షతోనే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని కురుపాం నియోజకవర్గ పరిశీలకులు అరేటి మహేష్‌బాబు అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాం టిడిపి కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహార దీక్షలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కు వస్తున్న ప్రజాదరణ చుసి ఓర్వలేక అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రజలందరూ చూస్తూ గమనిస్తున్నారని, ఖచ్చితంగా వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు రాంప్రసాద్, మండల కన్వీనర్లు కలిశెట్టి కొండయ్య, సుధా, టిడిపి నాయకులు కన్నా, కిమిడి రామరాజు, నందివాడ కృష్ణబాబు, నియోజకవర్గం యువత అధ్యక్షులు దివాకర్, పాల్గొన్నారు.

భామిని : బాబుతో నేను కార్యక్రమాల భాగంగా టిడిపి నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యాన మండలంలోని కోసంగూడకాలనీ, లోహరజోల, బిల్లుమడ, సింగిడి తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ బాబుకు అండగా నిలవండి



కురుపాంలో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మహేష్‌బాబు



జలదీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర భవిష్యత్తు కాపాడండని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంగూరు దశరథనాయుడు, ఎస్.ప్రకాశరావు, కరణం లచ్చుంనాయుడు, కె రాజారావు, మాజీ ఎంపిపి సవర కుంపి, మాజీ సర్పంచ్ కె.రామరాజు, మాజీ ఎంపిటిసి పిలక కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : చంద్రబాబుకు తోడుగా మేము సైతం కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల, పట్టణ అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తినాయుడు, బి.నీలకంఠంనాయుడు, కె.అసిరినాయుడు, పారిచర్ల వెంకటరమణ, బల్ల హరిబాబు, మాచర్ల అనిల్ కుమార్, వి.శ్రీనివాసరావు, ఎ.కుమారస్వామి, జామి సింహాచలం, డి.శ్రీనివాసరావు, తాతబాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : చంద్రబాబు నాయుడుకు మద్దతుగా మండలంలోని డుమ్మంగిలో టిడిపి నాయకులు ఆదివారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ఆధ్వర్యంలో బాబుతో నేను అని రాసి పలువురు నాయకులు పోస్టుకార్డులను చంద్రబాబు పేరుతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పోస్ట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మండంగి భూషణ తదితరులు ఉన్నారు.

జీతాల సమస్యపై విద్యాశాఖామంత్రికి లేఖ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎంఇఒ -2 పోస్టుల్లో నియమించబడిన మండల విద్యాశాఖ అధికారులకు జీతాల చెల్లింపులో ఏర్పడిన సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణకు లేఖ రాసినట్లు ఎపి ఎంఇఒల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖలో పర్యవేక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 679 మందిని ఎంఇఒ-2 పోస్టుల్లో నియమించారు. అయితే వీరికి జూన్ నుంచి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులుపడుతున్న విషయాన్ని విద్యామంత్రి, విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆర్థికశాఖతో మాట్లాడుతున్నామని, శాఖాపరంగా లేఖ కూడా రాయడం జరిగిందని, వీలైనంత త్వరగా జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ 1,2లకు నిర్దిష్టమైన జాబ్‌చార్ట్‌ను విడుదల చేయాలని కోరామన్నారు. అలాగే కొత్తగా నియమితులైన ఎంఇఒ 1,2 లకు విద్యా పర్యవేక్షణ, పాలనాపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు కనీసం రెండు రోజులు వృత్యాంతర శిక్షణ కూడా కల్పించాలని కోరామన్నారు. తమ లేఖపై స్పందించిన విద్యాశాఖ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సామల పేర్కొన్నారు.

కెజిబివి బాలికలు... ప్రతిభలో మెరికలు

క్రీడలు, చదువుల్లో రాణిస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మధ్యలో బడి మానేసిన వారిని తిరిగి పాఠశాలలో చేర్చేందుకు, తల్లిదండ్రుల్లేని పిల్లలు, చదివించలేని నిరుపేద కుటుంబాల బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూరిబా గాంధీ విద్యాలయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. అక్కడ బాలికలకు చదువుతోపాటు వివిధ విద్యలు నేర్పుతున్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక సమయాన్ని కేటాయించి తర్ఫీదు ఇస్తున్నారు. ప్రత్యేకంగా పోటీలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. అందుకే అక్కడ విద్యార్థినులు చదువుతోపాటు క్రీడలు, ఇతర అంశాల్లో సత్తా చాటుతున్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలు అసమాన ప్రతిభ కనబరుస్తున్నారు.

స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో 282 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో 6,7,8,9 తరగతులకు చెందిన బాలికలు 168 మంది ఉండగా, 42మంది పదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం 40, ద్వితీయ సంవత్సరం 36మంది చదువుతున్నారు. వీరికి కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా చదువు చెబుతున్నారు. పాఠశాల ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

క్రీడల్లోనూ ప్రతిభ

కెజిబివి విద్యార్థినిలు చదువుతోపాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణించి ఎన్నో పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ పాఠశాల విద్యార్థిని తోయక ప్రమీల పూణేలో జరిగిన జాతీయస్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చింది. గత ఏడాది జిల్లా స్థాయిలో జరిగిన క్రీడల్లో ఈ విద్యార్థులు విజేతగా నిలిచి మొదటి స్థానం పొందారు. ప్రతి ఏటా ఇక్కడ నుంచి ముగ్గురు లేదా నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికవుతున్నారంటే క్రీడల్లో వీరు ఎంత ప్రతిభ కనబరుస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. రాష్ట్రస్థాయి క్రీడల్లో గెలుపొంది అరకు ఎంపి మాధవిచే ప్రశంసలు పొందారు. క్రీడలతో పాటు ప్రతిరోజు ఇక్కడ విద్యార్థులకు యోగా చేయిస్తుంటారు.

ఐక్యరాజ్యసమితికి మనస్విని

ఇక్కడ 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సామల మనస్విని తన ప్రతిభతో ఐక్యరాజ్యసమితిలో మాట్లాడేందుకు చోటు దక్కించుకోవడం విశేషం. సెప్టెంబర్ 18,19 తేదీల్లో ఐక్యరాజ్యసమితి కేంద్ర కార్యాలయం, న్యూయార్కులో జనరల్ అసెంబ్లీ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిపై ఉన్నత స్థాయి రాజకీయ ఫోరంలో పాల్గొననుంది. నాడు-నేడు (పాఠశాల విద్య) కార్యక్రమాలపై మాట్లాడే అవకాశం వచ్చింది.



క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంపి మాధవి



సైన్స్ ప్రాజెక్ట్ పై అవగాహన

ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టులు తయారు చేయు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. మండల స్థాయిలో జరిగిన పలు సైన్స్ ఎగ్జిబిషన్‌లో సైన్స్ ప్రాజెక్టులను తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తల పనితనం, చంద్రయాన్-3 విజయవంతం వంటి అంశాలను విద్యార్థులకు వివరిస్తుంటారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో విద్యార్థులు దీన్ని స్ఫూర్తిగా తీసుకొని బొమ్మలు వేశారు.

అత్యధిక పాయింట్లు సాధిస్తా

నేను ఆరో తరగతి నుంచి ఇక్కడే చదువుకుంటున్నాను. పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తానన్న నమ్మకం ఉంది. ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో విద్యాబోధన చేస్తున్నారు.

ఊయక పూజా,
పదో తరగతి విద్యార్థిని.

అన్నింటా ముందంజ

కెజిబివిలో విద్యార్థినిలు చదువుతో పాటు క్రీడలు, కవితలు, నృత్యం, ఆత్మరక్షణ విద్య ఇలా అన్నింటా ముందుంటున్నారు. ఐదేళ్లుగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. పిల్లలను తమ సొంత బిడ్డల్లా చూసుకుంటున్నాం. వారి అభిరుచిని బట్టి వారికి ఇష్టమైన అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో విజేతలుగా నిలుస్తున్నారు. ప్రతి ఏటా రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు పొందుతున్నారు. వీరి విజయం కోసం ఉపాధ్యాయులు నిత్యం కృషి చేస్తున్నారు.

సిహెచ్ శ్రీరంజిని ప్రిన్సిపల్,
కెజిబివి, గుమ్మలక్ష్మీపురం,

ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు

హాస్టళ్లలో ప్రతి రోజు పోషకాహారం ఇస్తున్నారు. ఉపాధ్యాయులు మాతో పాటు రాత్రి వేళలో కూడా తోడుగా ఉంటూ మంచి విద్య అందిస్తున్నారు. అన్ని విషయాల్లోనూ మమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. ఎన్నో మంచి విషయాలు చెబుతూ, విద్యలోనూ, క్రీడల్లోనూ సత్ఫలితాలు సాధించేలా మమ్మల్ని తయారు చేస్తున్నారు.

ఎం. సంజన,
పదో తరగతి విద్యార్థిని

సాధన యువజన సంఘం రక్త దానం

నెల్లిమర్ల : సాధన యువజన సంఘం సభ్యులు స్వచ్ఛంద రక్త దానం చేశారు. ఆదివారం సాధన యువజన సంఘం అధ్వర్యంలో విజయనగరం సర్వజన ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మేము సైతం అంటూ జరజాపు పేటకు చెందిన సాధన యువ జన సంఘం సభ్యులు రక్తదానం చేశారు. దేశ ప్రధాని పుట్టినరోజు సందర్భంగా సామాజిక చైతన్యంతో సాధన యువజన సంఘం సభ్యులు తమ వంతు బాధ్యతగా పాల్గొని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. సాధన అధ్యక్షులు పోలుభోతు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత రక్తదానం వైపు మొగ్గుచూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, బి అప్పలనాయిడు, కౌన్సిలర్, మాతృ భూమి సేవా సంఘం అధ్యక్షుడు ఇప్పలవలస గోపి, లాబ్ టెక్నీషియన్స్ మురళి, రమణ, సాధన సభ్యులు పూర్ణా, రామకృష్ణ, కె శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

పిడుగుపడి మహిళకు అస్వస్థత

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని చిన నందబలగ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పిడుగు పడటం వల్ల పొలంలో పని చేస్తున్న గులిపల్లి సావిత్రి అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికలు గుర్తించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బోను వెంకటరమణ, పైలట్ (డ్రైవర్) అమర రాజేష్ చిన నందబలగ చేరుకొని అత్యవసర వైద్యాన్ని అందించారు. మెరుగైన వైద్యం కోసం బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ నుండి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతంపేట

కొత్తూరు నుండి కలప లోడుతో రాజాం వెళ్తున్న ట్రాక్టర్‌పై ఉన్న వంజరాపు నారాయణరావు (65) సీతంపేట సమీపాన జారిపడి మృతి చెందారు. వివరాలకు వెళ్తే విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం మునకాలవలసకు చెందిన నారాయణరావు శనివారం రాత్రి కొత్తూరు నుంచి రాజాం వెళ్తున్న కలపలోడుతో వచ్చాడు. ప్రమాదశాత్తు జారిపడంతో అక్కడ దగ్గరలో మృతి చెందాడు . మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీతంపేట ఎస్సై ఎ.నీలకంఠరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన నారాయణరావు